క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్‌లో ఒక అతిథి అధ్యాపక నియామకం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి ఒక ప్రకనటలో తెలిపారు. అర్హులైన పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎస్సీ, ఎస్టీలకు కనీసం 50శాతం), (ఓసీ, బీసీలకు కనీసం 55శాతం) మార్కులు, అలాగే నీట్, సెట్, పీహెచ్‌డీలలో ఏదైనా ఒకటి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన నైపుణ్యంగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులు తమ ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

అంతర పంటలపై శిక్షణ



మాట్లాడుతున్న బాలశౌరి

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులంతా అంతర పంటల సాగుపై ప్రత్యేక దృష్టిసారించాలని ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి పిలుపునిచ్చారు. లొడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండాలో మంగళవారం రైతులకు అంతర పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి, పత్తి పంటలకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అలా చేయడం వల్ల భూసారం అంతరించి పోతుందన్నారు. పంటల మార్పిడి, అంతర పంటలు వేసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, కనుకం, రవీందర్ భూక్య బియ్య, మూడావత్ తిరుమల పాల్గొన్నారు.

నిధుల కోసం వినతి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పంతుల్‌తండా పరిధిలోని చెరువుకొమ్ముతండా, ఫీక్కుతండా, ధరావత్‌తండాలకు వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా తయారైందని, దానికి మరమ్మతులు చేయించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం తండా యువకులు ఎంపీడీఓ భానోతు జయరాం నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ విషయాన్ని అనేకసార్లు నేతలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. రోడ్డంతా గుంతలు పడి ప్రమాదకరంగా ఉందని వాపోయారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డంతా కోతకు గురై ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నామని వాపోయారు.


భూంపల్లిలో 'రీడ్ ఏ థాన్'



విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూమ్ టు రీడ్ కార్యక్రమంలో భాగంగా అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 'రీడ్ ఏ థాన్–2024' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను ఏక కాలంలో చదవించారు. పుస్తకాలను చదవడం వల్ల కలిగే విజ్ఞానం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశ్వరి, సరిత పాల్గొన్నారు.

పంచాయతీ ద్వారా నిర్వహించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను పంచాయతీ ద్వారా నిర్వహించాలని కోరుతూ మంగళవారం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య మాట్లాడుతూ పదిహేను ఏళ్ల క్రితం చాగళ్ల నరేంద్రనాథ్ తన ట్రస్ట్ ద్వారా వాటర్ ఫిల్టర్‌ను అందించారన్నారు. వాటర్ ప్లాంట్ భవనంతో పాటు విద్యుత్ బిల్లులు, బోరు మోటారు పంచాయతీకి సంబంధించినవేనని, కానీ గత సర్పంచ్‌లు మరమ్మతుల పేరిట వాటర్ ప్లాంట్ డబ్బులను వాడుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పది రోజులుగా మిషన్ నడవడం లేదని, పంచాయతీ అధికారులు స్పందించి పంచాయతీ ద్వారా ప్లాంట్‌ను కొనసాగించాలని, లేకపోతే వేలం వేయాలని కోరారు. సుధాకర్‌రెడ్డి, అశోక్, ఆంజనేయులు, మల్లేశం, ఎల్లారెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్లు.. స్తంభించిన రాకపోకలు



హుస్నాబాద్‌రూరల్: కోనేటి వాగు దాటేందుకు రైతుల కష్టాలు

దుబ్బాకరూరల్: వర్షాలు ఏకధాటిగా కురవడంతో మండలంలోని రాజక్కపేట, ఎల్లాపూర్, బల్వంతాపూర్, చింతమడక గ్రామాలకు వెళ్లేదారిలో రోడ్డు మధ్య కాలువలు ఉండడం వల్ల నీటి ప్రవాహం రావడంతో రాకపోకలు నిలిచి పోయాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆకారం గ్రామంలో పలు ఇళ్లు కూలాయి. అలాగే మున్సిపాలిటీ పరిధి 13వ వార్డులోని ఎస్సీ కాలనీలో చెక్కపల్లి శ్రీనివాస్‌కు చెందిన పెంకుటి ఇల్లు కూలింది. ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు.

మత్తడి దూకుతున్న నల్ల చెరువు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలంలో కురిసిన భారీ వర్షానికి చెరువులు నిండుకుండల్లా తలపిస్తున్నాయి. రాయపోల్ మండల కేంద్రంలోని నల్ల చెరువునకు భారీగా వరద వచ్చి చేరింది. దీంతో చెరువు మత్తడి దూకుతోంది. దీంతో ప్రజలు మత్తడి చూడడానికి భారీగా తరలి వస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూసలపల్లెకు దారి బంద్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి శివారులోని పూజలపల్లెకు కోనేటి వాగు పొంగడంతో దారి బంద్ అయింది. పల్లె వాసులు నిత్యావసర వస్తువుల కోసం రావాలంటే 10కిలో మీటర్లు తిరిగి రావాల్సి వస్తుందని పల్లె వాసులు వాపోతున్నారు. ప్రతియేటా వాగు పొంగిప్రవహిస్తే తోటపల్లికి రాకపోకలు నిలిచిపోతాయి. పాలు అమ్ముకునే రైతులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరుచేసి పనులు చేయించాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.





వర్షానికి కూలిన ఇల్లు... బల్వంతాపూర్–చింతమడక గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

వరదనీటితో తీరని నష్టం

● మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కోరారు. భారీ వర్షాలకు నిండుకుండగా మారిన హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, చెరువు, మత్తడి. హుస్నాబాద్–పందిల్ల బ్రిడ్జిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో భారీ వర్షాలు కురువడం రైతులకు లాభం జరిగినా.. దుకాణాలు, ఇండ్లలోకి వరద నీరు చేరి తీవ్ర నష్టం జరిగిందన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో డ్రైనేజీ నీరు సక్రమంగా పోయే విధంగా చూస్తే నష్టం జరిగేది కాదని వాపోయారు. వరద ప్రభావిత కాలనీలను మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారని, రానున్న రోజుల్లో వరద నీటి ముప్పు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని సతీశ్ కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ నేత అన్వర్ పాష, కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, గోవిందు రవి, హరీశ్, శంకర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, మధుకర్, రవీందర్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువును పరిశీలిస్తున్న సతీశ్‌కుమార్

పందిల్ల బ్రిడ్జి పరిశీలన

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్ల బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మార్గానికి అంతరాయం కలిగింది. దీంతో మాజీ ఎమ్మెల్యే బ్రిడ్జిని పరిశీలించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక రోడ్డును వేయాలని అధికారులకు సూచించారు. పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మల్లికార్జున్‌రెడ్డి, అన్వర్, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దు

● సమస్యలను సత్వరం పరిష్కరించాలి
● మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరూ ఉండొద్దని, అలాంటి వారు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా వార్డుల్లో సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. 6వ వార్డు కోమటిచెరువు ప్రాంతంలో చెత్త సేకరణ ప్రక్రియ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని హానికరమైన చెత్తను మున్సిపల్ వాహనానికి అందించాలని, రోడ్డుపై వేయకూడదని సూచించారు. 3వ వార్డులో ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్న వారికి నోటీసులు జారీ చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే హౌసింగ్ బోర్డ్ వద్ద ఐటీసీ కేంద్రాన్ని పరిశీలించి, పొడి చెత్తను వెంటనే కంప్రెషర్ చేసి తరలించాలని సూచించారు. కేసీఆర్‌నగర్‌లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనుల గురించి ఆరా తీశారు. 20 వార్డులో యూజీడీ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్లు సాయి కుమార్, రియాజ్, ఆనంద్, అధికారులు అన్వేష్, సతీశ్, వనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఆశ్రిత్ కుమార్

సేవలతోనే మంచి గుర్తింపు: ఏడీఏ

గజ్వేల్‌రూరల్: ఉద్యోగులు తమ విధుల్లో భాగంగా ఏ ప్రాంతంలో ఉన్నా మెరుగైన సేవలందిస్తే మంచి గుర్తింపు తెచ్చుకోవచ్చని ఏడీఏ బాబునాయక్ పేర్కొన్నారు. కొండపాక ఏఓ ప్రియదర్శిని, కోమటిబండ ఏఈఓ వెన్నెల, వడ్డెపల్లి ఏఈఓ మధులిక శ్రీ, మర్పడగ ఏఈఓ విష్ణుకుమార్, రాయపోల్ ఏఈఓ ప్రశాంత్‌రెడ్డి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న నేపథ్యంలో వారిని ఐఓసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వద్ద ఆయన మంగళవారం ఏఓ నాగరాజుతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో ఎక్కడున్నా అన్నదాతలకు అండగా ఉంటూ అధిక దిగుబడులు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగరాజు, శివరామకృష్ణ, గోవిందరాజు, నరేశ్, గణేశ్, జ్యోతి, నర్సింహులు, మాధవి, అనూష, శ్రీహరి, ప్రియాంక, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న ఏడీఏ

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేటకమాన్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన ఆదిమూలం రాజేందర్ సెలూన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రాజేందర్ భార్య స్రవంతి నాలుగు రోజుల క్రితం బంధువుల ఇంట్లో శుభకార్యానికి చేర్యాలకు వెళ్లగా.. తన పెద్దమ్మకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో రాజేందర్ చికిత్స నిమిత్తం సోమవారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న అరతులం బంగారం, పది తులాల వెండి, రూ.60వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. రాజేందర్ భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

చేర్యాల(సిద్దిపేట): లారీ ఢీకొని ద్విచక్రవాహన దారుడు గాయపడ్డ ఘటన మంగళవారం పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దమ్మగడ్డకు చెందిన పుట్ట పరశురాం తన ద్విచక్ర వాహనంపై ఆకునూరు వైపు వెళ్తుండగా చేర్యాల వైపు ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కాలువ ఆక్రమణపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి గ్రామంలో వరద కాలువను ఆక్రమించిన గ్రామస్తుడు ముత్తినేని లింగారావుపై ఇరిగేషన్ ఏఈ మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపెల్లి శివారులోని ఫాంహౌస్‌లో మంగళవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.34వేలు, 8సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు కమిషనరేట్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.

చెంచెల్ చెరువుపల్లిలో..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని చెంచల్ చెరువుపల్లిలో పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురిని అరెస్టుచేసి వారి నుంచి రూ.5వేలు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్ఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తుటి చంద్రారెడ్డి, మెతుకు బాల్‌రెడ్డి, బజ్జరపల్లి శ్రీనివాస్, పిడిశెట్టి సాయికిరణ్, ఎల్లబోయిన రమేశ్, ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా దాడి చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కలెక్టర్ ఉపాధ్యాయుడైన వేళ..

దుబ్బాక: కలెక్టర్ మనుచౌదరి లెక్కల మాస్టారుగా మారి విద్యార్థులకు గణితం పాఠాలు బోధించారు. పట్టణంలోని కేజీబీవీలో టెన్త్ క్లాసు విద్యార్థులకు లెక్కలు చేయడంలో మెలకువలు నేర్పించారు. బ్లాక్ బోర్డుపై లెక్కలు వేసి సులభంగా ఎలా చేయాలో వివరించారు. కేజీబీవీ, మైనార్టీ రెసిడెన్షియల్‌తో పాటు దౌల్తాబాద్ మండలంలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలోని డార్మెటరీ, అసంపూర్తిగా ఉన్న ప్రహరీని పరిశీలించారు. వెంటనే ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈకి ఫోన్‌చేసి పరిస్థితిని వివరించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రూ.67లక్షలతో రెండు అదనపు డార్మెటరీ రూమ్‌లు, విద్యుత్, ప్లంబింగ్ పనులు, టాయిలెట్స్ నిర్మాణం కోసం టెండర్‌లు పిలిచామని త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. ప్రహరీ నిర్మాణానికి ఉన్న భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. మైనార్టీ రెసిడెన్షియల్‌లో సైతం అదనపు డార్మెటరీ రూములను పూర్తిచేయాలని, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు కావాలని ప్రిన్సిపాల్ విమలారెడ్డి విన్నవించడంతో స్పందించిన కలెక్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



లెక్కలు బోధిస్తున్న కలెక్టర్ మను చౌదరి

వర్షాలపై అప్రమత్తత అవసరం

● సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: రాబోయే 24గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించినందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండకూడదన్నారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలలో నీరు ప్రవహిస్తున్నందున ప్రజలు అటువైపు వెళ్లకుండా బారికేడ్స్ ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజాప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు, ఇతర పరికరాలను తాకవద్దని సూచించారు.



సీపీకి మొక్కను అందజేస్తున్న ఆశ్రిత్‌కుమార్

సీపీని కలిసిన మున్సిపల్ కమిషనర్

మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆశ్రిత్‌కుమార్ సీపీ అనురాధను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని పరిస్థితి గురించి చర్చించారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

● సీఐ లతీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ లతీఫ్

కొండపాక(గజ్వేల్)/దుబ్బాక/మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): వినాయక నవరాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తొగుట సీఐ లతీఫ్ నిర్వాహకులను కోరారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో వినాయక మండపాల నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులతో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నవరాత్రోచ్ఛవాల సందర్భంగా ఏర్పాటుచేసే విగ్రహ మండపాలను తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీని వల్ల ఎక్కడ ఎన్ని ప్రతిష్ఠలు జరిగాయి. ఏయే రోజుల్లో నిమజ్జనాలు చేసుకోవాలన్న స్పష్టత రావడంతో బందోబస్తు ఏర్పాటుకు దోహదపడుతుందని చెప్పారు. మండపాల వద్ద విద్యుత్తు ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనాల్లో గొడవలు సృష్టించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సీఐ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా వివిధ సంఘాల నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ గంగరాజు, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఆర్ఐ నరేందర్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. మద్దూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ షేక్ మహబూబ్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీశ్, నాయకులు తాజ్ మహ్మద్, బీజేపీ నాయకులు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ రాజుగౌడ్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఏర్పాటుచేసే విగ్రహాలు, మండపాల వివరాలను పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ కుమారస్వామి పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల ఉన్నత పాఠశాలలో 2004–2005లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఉత్సాహం, ఉల్లాసంగా నిర్వహించారు. 20 యేళ్ళ తరువాత వారంతా ఒకచోట కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పట్లో విద్యాబోధన చేసిన గురువులు బలరాం, యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, పద్మను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేశ్, అనిల్, ప్రభాకర్, కిరణ్, శ్రీధర్, సత్యనారాయణ, బాల్‌రాజ్, పాషా, రామకృష్ణ, దివ్య రెడ్డి, రాణి, స్వప్న, కృష్ణలీల, కరుణ, నాగరాణి, చంద్రకళ, విశాలి, బాల్‌లక్ష్మి పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

◆ **మహిళల రక్షణ చట్టాలపై అవగాహన**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం చేర్యాల పోలీసులు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్.శ్రీను, హుస్నాబాద్ షీటీం సభ్యులు మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు, తదితర అంశాలపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరేశ్, కాలేజ్ హెచ్ఓడీ మహతి, అధ్యాపకులు, హుస్నాబాద్ షీటీం బృందం సదయ్య, స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

◆ **పరామర్శకు వెళ్తే దాడులా?**

గజ్వేల్: ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డిల వాహనాలపై రాళ్లురువ్వడం, బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం సహించరానిదని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తారు.

హరీశ్‌రావుపై దాడి అమానుషం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఖమ్మంలో మాజీ మంత్రి హరీశ్‌రావుపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడం అమానుషమని మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజులు మండిపడ్డారు. లింగం, రాజశేఖర రెడ్డి, నాగరాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

◆ **అధికారుల పరిశీలన**

గజ్వేల్‌రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నిలిచిన వర్షపునీటిని అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ శ్రావణ్, సీఐ సైదా తూప్రాన్ రోడ్డులోని ఎర్రకుంట కాలువ నీటిని, ప్రజ్ఞాపూర్‌లో ఊర చెరువు కాలువలను పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా జాలిగామ, కోమటిబండ, రిమ్మనగూడ, కోనాపూర్ తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటలను సీఐ సైదా పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేశారు.

◆ **మకర తోరణాలు అందజేత**

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయానికి హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన దాతలు కన్నోజు శ్రీనివాసాచార్యుల దంపతులు రూ.26వేలతో ఆభరణాన్ని తయారు చేయించి మంగళవారం అందజేశారు.

◆ **మాజీ ఎంపీపీ అంత్యక్రియలు**

కొండపాక(గజ్వేల్): కొండపాకలో మంగళవారం మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ అనంతుల శారద అంత్యక్రియలు బాధాప్త హృదయాలతో సాగాయి. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో శారద మృతి చెందిన విషయం తెలిసిందే.

◆ **పెట్రోల్ బంక్ వద్దు**

సిద్దిపేటఅర్బన్: పొన్నాల శివారులోని పోలీస్ కన్వెన్షన్ హాల్ పక్కన జనావాసాల మధ్య నిర్మించతలపెట్టిన పెట్రోల్ బంకును ఇళ్లకు దూరంగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికులు మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ బంకు వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు**

వర్గల్(గజ్వేల్): పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వర్గల్ మండలం బొర్రగూడెం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా పాఠశాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు తీరును ప్రశంసించారు. ఆయన వెంట రంగారెడ్డి, మోహన్, రహీం చెన్నయ్య, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

◆ **కుటుంబ నిర్ధారణ సర్వే ముమ్మరం**

మిరుదొడ్డి(దుబ్బాక): రూ.2లక్షలలోపు పంట రుణాలు మాఫీ కానీ రైతు కుటుంబాల నిర్ధారణ సర్వేను ముమ్మరం చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ తెలిపారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ కోసం మంగళవారం సర్వే నిర్వహించారు. శ్రీనివాస్, ఏఈఓలు సాయికుమార్, సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి**

దుబ్బాక: ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సీఐటీయూ కన్వీనర్ భాస్కర్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తిమ్మాపూర్, రామక్కపేట పీహెచ్‌సీ మెడికల్ అధికారులకు వినతిపత్రాలు అందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990